క్లుప్తంగా

క్రీడా విజేతలకు అభినందన



ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీ, బహుమతులతో విద్యార్థినులు, అధ్యాపకులు

భీమునిపట్నం: స్థానిక మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు క్రీడల్లో సత్తా చాటుతున్నారు. ఇటీవల కంచరపాలెంలో జరిగిన ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీల్లో అన్ని విభాగాల్లో ప్రతిభను చూపి ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకున్నారు. దీంతో కళాశాలలో సోమవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.మురళీకృష్ణ వారి ప్రతిభను కొనియాడారు. కళాశాల విద్యార్థినులు మూడోసారి ఓవరాల్ చాంపియన్ షిప్ గెలుచుకుని హ్యాట్రిక్ సాధించారని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ షబ్నం పర్వీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు మధ్యాహ్నం నుంచి శ్రీవారి దర్శనాలు

ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజన సేవ

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో (టీటీడీ) మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు సర్వదర్శనాలు కల్పిస్తామని ఈ నెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం సంప్రదాయం ప్రకారం ముందుగా వచ్చే మంగళవారం ఆలయ శుద్ధి, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తామని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయాన్ని సుగంధ ద్రవ్యాలతో శుద్ధి చేసి, అనంతరం భక్తులకు యధావిధిగా సర్వదర్శనాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. భక్తులు గమనించాలని కోరారు.

పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నేడు

భీమునిపట్నం: భీమిలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల వద్ద మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ తెలిపింది. పదోతరగతి, ఇంటర్, ఐటీఐ, డీజిల్ మెకానిక్, ఆటోమొబైల్ డిప్లమా, ఎంబీఏ, బీటెక్ చదివినవారు అర్హులని నిర్వాహకులు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు ఆరోజు ఉదయం పది గంటల నుంచి హాజరు కావాలని సూచించారు.

రెవెన్యూ సదస్సులో 16 ఫిర్యాదులు



ఫిర్యాదులు తీసుకుంటున్న రెవెన్యూ అధికారులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడ సచివాలయం వద్ద సోమవారం నిర్వహించిన సదస్సులో 16 వినతులు వచ్చాయి. డీటీ లక్ష్మి స్థానికుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వీటిని పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసు కుంటామని తెలిపారు. అయితే ముందస్తు సమాచారం గానీ, ప్రచారం గానీ లేకుండా నామమాత్రంగా సదస్సు నిర్వహించారు. ఆర్ఐ మల్లేశ్వరరావు, కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాదానికి విరాళం



దాత వెంకన్నబాబుకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్ విక్రమ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గాజువాక నివాసి జి.వెంకన్నబాబు రూ.లక్ష విరాళమిచ్చారు. సంబంధిత నగదును సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో అందించారు. దాతకు ప్రొటోకాల్ సూపరింటెండెంట్ బాండ్ ఇచ్చారు. దేవస్థానం తరపున అధికారులు దాతకు ప్రత్యేక దర్శనం కల్పించి ప్రసాదం,శేషవస్త్రం అందించారు.

వంటనూనెలు సలసల





- ఏడాదిలో లీటర్‌పై రూ.45 పెరుగుదల
- 15 లీటర్ల డబ్బాపై రూ.600
- విలవిల్లాడుతున్న సామాన్యులు
- పండగ వేళ పిండివంటలు కష్టమే..

వంటనూనెలు సలసల కాగుతున్నాయి. ఆ సెగలు సామాన్య, మధ్యతరగతి వారిని బెంబేలెత్తిస్తున్నాయి. పండగ వేళ పిండివంటలెలా అంటూ హడలిపోతున్నారు. అన్ని ధరలూ ఇలా పెరిగిపోతే ఇక జీవనం సాగేదెలా అంటూ నిట్టూరుస్తున్నారు.

తగరపువలస: వంటలకు రుచి వచ్చేది కమ్మని నూనె వాసనతోనే. అయితే, ఆ వంటనూనెల ధరలు చుక్కలను తాకడంతో సామాన్యులు వాటిని అందుకోలేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గతేడాదితో పోలిస్తే మార్కెట్‌లో నూనె ధరలు లీటరుకు రూ.25 నుంచి రూ.40 వరకు పెరిగాయి. సంక్రాంతి పండగ వేళ ఇప్పటికే విద్యుత్ చార్జీలు మోత మోగించగా నూనె ధరల మంటలతో వినియోగదారులు సలసల కాగిపోతున్నారు. దీంతో స్వీట్లు, హోటళ్లు, హాస్టల్ యాజమానులు మెనూలో ధరలను అమాంతం పెంచేస్తున్నారు.


గతేడాది చివరిలో కేంద్ర ప్రభుత్వం సన్‌ఫ్లవర్, సోయాబీన్, పామాయిల్ తదితర నూనెలపై దిగుమతి సుంకాలను 5.5 నుంచి 27.5 శాతానికి పెంచడంతో క్రమేణా ధరలు పెరుగుతూ వచ్చాయి. దిగుమతి సుంకాలు తగ్గిస్తే తప్ప నూనెల ధరలు చుక్కల నుంచి దిగిరావని వ్యాపారులు అంటున్నారు. ఇప్పటికీ రోజూ లీటర్ ప్యాకెట్లపై రూపాయి వంతున, 15 లీటర్ల డబ్బాలపై రూ.20 వరకు ధరలు పెరుగుతూ వినియోగదారులతో దోబూచులాడుతున్నాయి. ప్రస్తుతం సంక్రాంతి కారణంగా వీటి ధరలు మరింతగా పెరగవచ్చని భావిస్తున్నారు. భీమిలి నియోజకవర్గంలో వినియోగదారులకు నెలకు 750 టన్నుల వరకు నూనె అవసరం ఉంటుంది. ప్రస్తుతం సంక్రాంతి నెలలో పిండివంటల కారణంగా ఈ వినియోగం 2500 టన్నుల వరకు ఉంటుందని అంచనా.

ఏడాదిగా నూనె ధరల పెరుగుదల ఇలా..

నూనెల రకాలు	2024 జనవరి		2024 సెప్టెంబరు		2025 జనవరి	
	లీటరు	15 లీ.	లీటరు	15 లీ.	లీటరు	15 లీ.
పామాయిల్	రూ.90	రూ.1250	రూ.110	రూ.1550	రూ.135	రూ.2000
సన్‌ఫ్లవర్	రూ.100	రూ.1550	రూ.123	రూ.1950	రూ.150	రూ.2200
రైస్‌బ్రాన్	రూ.125	--	రూ.140	--	రూ.145	--

హడలిపోతున్న పప్పుల చీటీల నిర్వాహకులు

ఏడాది కాలంగా వినియోగదారుల నుంచి డబ్బు వసూలు చేసే పప్పుల చీటీల నిర్వాహకులు చివరికి వచ్చేసరికి సరకులు ఇవ్వలేక హడలెత్తిపోతున్నారు. తమ వద్ద చీటీలు వేసేవారికి 15 లీటర్ల నూనె డబ్బాలు రెండు ఇవ్వవలసి ఉండగా.. వీటిపై రూ.వెయ్యి వరకు భారం పడుతుంది. వందల సంఖ్యలో సభ్యులకు రూ.లక్షల్లో భారం పెరగడంతో చేతులు ఎత్తేస్తున్నారు. గత సంక్రాంతి సమయంలో వర్షాల కారణంగా బియ్యం ప్యాకెట్ల ధరలు పెరగగా ఈ ఏడాది నూనెల వంతు వచ్చింది. కోవిడ్ కారణంగా 2022, 2023 సంవత్సరాలలో డబ్బులు వసూలు కాకపోవడం 2024లో బియ్యం ధరలు, 2025లో నూనెల ధరలు ఆకాశన్నంటడంతో పప్పుల చీటీలు సాఫీగా సాగడం లేదు.



లారీ నుంచి దించుతున్న నూనె డబ్బాలు

పండగ ఎలా గడుస్తుందో?



మాది మధ్య తరగతి కుటుంబం. నెలకు 4 ప్యాకెట్లు నూనె వినియోగిస్తాం. ఇది పండగ నెల రెట్టింపు వాడవలసి ఉంది. పిండివంటలంటే నూనెతోనే పని. కానీ ధరలు మాత్రం 50 శాతం వరకు పెరిగాయి. వాడకం ఎంత తగ్గించగలం? పండగ ఎలా గడుస్తుందో?

–ఇంటి శాంతికుమారి, బంగ్లామెట్ట

ధరలు పెరుగుతూనే ఉన్నాయి



నూనెల ధరలు తగ్గుతాయని వేచి చూస్తున్న కొద్దీ పెరుగుతూ ఉన్నాయి. పండగ కూడా తోడవటంతో వ్యాపారులు నూనెను బ్లాక్ చేసే అవకాశం ఉంది. ప్రభుత్వం ధరలైనా తగ్గించాలి, బ్లాక్ మార్కెటింగ్ అయినా అరికట్టాలి.

–ఒనుము శ్రీదేవి, తగరపువలస

ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేయాలి



సంక్రాంతి పండగను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వంటనూనెను రేషన్ డిపోల ద్వారా సబ్సిడీ ధరలపై సరఫరా చేయాలి. లేదంటే మార్కెట్‌లో నూనె ధరలు భరించలేం.

– కొణిదెల ముత్యాలమ్మ, తగరపువలస



పప్పుల చీటీల కోసం నిల్వ చేసిన నూనె డబ్బాలు

పాఠశాలల్లో ఎస్ఎంసీ సభ్యులతో సమావేశాలు

పద్మనాభం: మండలంలోని పలు పాఠశాలల్లో ఎస్ఎంసీ సభ్యులతో ఉపాధ్యాయులు సోమవారం సమావేశాలు నిర్వహించారు. విలాస్కాన్‌పాలెం, పొట్నూరు, కృష్ణాపురం కాలనీ, పద్మనాభం, ఇసకలపాలెం, కురపల్లి ప్రాథమిక పాఠశాలల్లో, పద్మనాభం, మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోనూ ఈ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో విద్యార్థుల ప్రగతి, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, పాఠశాలల అభ్యున్నతిలో ఎస్ఎంసీల పాత్ర తదితర అంశాల గురించి హెచ్ఎంలు వివరించారు.



సమావేశం వివరాలు తెలియజేస్తున్న సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు

బంగ్లామెట్ట పాఠశాలలో..

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల నిర్వహణ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కమిటీ సభ్యులకు విధులు, బాధ్యతలను ఉపాధ్యాయుడు నరహరిశెట్టి రమేష్ వివరించారు. మధ్యాహ్న భోజనం, డ్రాపౌట్లు, నదుపాయాల గురించి తెలియచేశారు. సమావేశంలో స్కూల్ కమిటీ చైర్మన్ షేక్ షర్మిల, పందిరి ప్రవీణ్‌కుమార్, సచివాలయ సిబ్బంది అమ్మోజీరావు, హేమలత, స్వాతి, ఉపాధ్యాయులు బుగత మల్లిక, ఈగల సంజీవి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు అమ్మవార్ల ఆలయానికి పెరుగుతున్న రాబడి



సంగివలస కొత్తమ్మతల్లి

తగరపువలస: సంగివలస కొత్తమ్మతల్లి (ముగ్గురు అమ్మవార్లు) ఆలయానికి గత నెల రోజులుగా రాబడి పెరిగింది. ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన ఈ ఆలయానికి సుమారు ఒకటిన్నరేళ్లుగా ఆదాయం గణనీయంగా పడిపోయింది. అంతకు ముందు ఈ ఆలయానికి హుండీ ఆదాయం నెలకు రూ.లక్షన్నర పైచిలుకు వచ్చేది. తరువాత సిబ్బంది నిర్లక్ష్యం, కొరత కారణంగా ఈ ఒకటిన్నరేళ్ల ఆదాయం తగ్గిపోవడమే కాకుండా ఈ ఆలయ పరిధిలో ఉన్న లంగర్‌ఖానా, నీలయమ్మసత్రం భూములు అన్యాక్రాంతమయ్యాయి. అయినప్పటికీ ఆలయం నుంచి ఎవరూ బాధ్యత వహించేవారు లేకపోయారు. ఆలయంలో దర్శనాలకు వచ్చే భక్తులకు టిక్కెట్లు, మొక్కుబడులపై నిర్లక్ష్యం కారణంగా నెలరోజుల క్రితం వరకు రోజుకు రూ.200 మాత్రమే ఆదాయం వచ్చేది, మంగళ, ఆదివారాలలో రూ.300 ఉండేది. నెలంతా చూసినా రూ.10వేల ఆదాయం వచ్చేది కాదు. దీంతో గత ఆరు మాసాలుగా ఆలయ సిబ్బందికి జీతాలు చెల్లించే పరిస్థితి లేకుండా పోయింది. అలాగే అమ్మవార్ల భోగానికి వినియోగించే ముడిసరుకులకు బిల్లులు కూడా కిరాణా దుకాణాలకు పేరుకుపోయినట్టు తెలుస్తుంది. ఆదాయం తగ్గిపోతుండటంతో ఆలస్యంగా దేవాదాయశాఖ మేలుకుంది. నెలరోజుల క్రితం ఈవోగా డి.వి.ఎస్. సురేష్‌బాబును నియమించడంతో పాటు భక్తులకు టిక్కెట్లు కొట్టేందుకు కాంట్రాక్ట్ పద్ధతిలో ఒకరిని నియమించారు. ప్రస్తుతం హుండీ ఆదాయం కాకుండా టిక్కెట్ల రూపంలో రోజుకు రూ.2వేలు వరకు వస్తోంది. పండగ, సెలవు రోజుల్లో ఈ ఆదాయం రూ.10వేల వరకు ఉంటోంది. దీంతో ఈ నెలలో రూ.లక్ష వరకు ఆదాయం రావచ్చని భక్తులు భావిస్తున్నారు. అదేవిధంగా గత సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా అన్యాక్రాంతమైన లంగర్‌ఖానా, నీలయమ్మసత్రం భూములను కూడా పరిరక్షించాలని భక్తులు కోరుతున్నారు.

వీధుల్లోనే మురుగు ప్రవాహం

ఎగుడు దిగుడుగా రోడ్లు

తగరపువలస: భీమిలి మండలం నారాయణరాజుపేట పంచాయతీలో వీధులన్నీ ఎగుడు దిగుడుగా ఉన్నాయి. గతంలో జల్‌జీవన్ పథకం పైప్‌లైన్ వేయడానికి తీసిన గోతులు సక్రమంగా పూడ్చలేదు. దీంతో ప్రాథమిక పాఠశాల మొదలుకుని ప్రధాన వీధులతో పాటు ఎస్సీ కాలనీ వరకు ఇదే పరిస్థితి నెలకొని ఉంది. వీధులన్నీ మురుగునీటి కాలువలుగా మారిపోయాయి. వర్షాలు పడితే చెరువులుగా మారిపోతున్నాయి. ఈ కారణంగా ప్రస్తుతం ఉన్న ఈ రహదారులపై ద్విచక్రవాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి. భీమిలి నియోజకవర్గంలోనే అతి చిన్న పంచాయతీ అయిన నారాయణరాజుపేటలో రహదారులు, డ్రైనేజీలు నిర్మించాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.



నారాయణరాజుపేటలో ఎగుడు దిగుడు ఉన్న వీధి

ఇంత నిర్లక్ష్యమా?

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎండాడ, సాగర్‌నగర్, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ విద్యుత్ వైర్ల కోసం ఏర్పాటు చేసిన కనెక్షన్ బాక్స్‌ల మూతలు మూయకుండా తెరచి ఉంచుతున్నారు. ఇది చాలా తక్కువ ఎత్తులో ఉండటంతో చిన్నారులు, పెద్దవారు ఎవరైనా వీటిని తాకినా ప్రాణ నష్టం తప్పదు. దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయింది. ప్రమాదం జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



తెరచి ఉన్న పవర్ బాక్స్

బోరవానిపాలెం హైవేపై జింక మృతి

మధురవాడ: జాతీయ రహదారిపై బోరవానిపాలెం సమీపంలోని డంపింగ్ యార్డుకు వెళ్లే జంక్షన్ వద్ద సోమవారం ఉదయం జింక మృతి చెందింది. ఉదయం సుమారు 7.30–8 గంటలు సమయంలో జాతీయ రహదారి దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో జింక మృతి చెందింది. దీనిని గమనించిన వాహనదారులు పోలీసులు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలికి చేరుకున్నారు.



హైవేపై మృతి చెందిన జింక

దివ్యాంగులకు సరకుల పంపిణీ

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతినపేట వద్దనున్న సెయింట్ పీటర్స్ చర్చిలో సోమవారం చర్చి సంఘం గౌరవ కార్యదర్శి డాక్టర్ కులిడి సురేష్‌కుమార్ దివ్యాంగులకు నిత్యావసర సరకులు అందించారు. 50 మందికి బియ్యం, వంటనూనె, పప్పులు, కూరగాయలు, దుస్తులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి పండగ వస్తున్న తరుణంలో నిరుపేద దివ్యాంగులకు తమ వంతు సాయంగా వీటిని అందించామన్నారు. లక్ష్మణ్, సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాస్టర్ చైతన్యకుమార్, సంఘం సభ్యులు సుధాకర్, విజయ్, లీలాధామస్, పూర్ణిమ, మేరీ, శామ్యూల్, రాజేష్ పాల్గొన్నారు.



సరకులు అందుకున్న దివ్యాంగులతో సురేష్

వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

పీఎం పాలెం: పీఎం పాలెం తులసీనగర్ ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా చందక విశ్వేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. క్లబ్ గౌరవ అధ్యక్షుడిగా గాదె రోశిరెడ్డిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పి.సన్నిబాబు, పి.వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శిగా జి.లోవరాజు, జాయింట్ సెక్రటరీగా పోతిన సూరిబాబు, ట్రెజరర్‌గా ఎస్.ఐజాక్, జాలీ వాకర్‌గా ఎస్.గౌతం చక్రవర్తి, మరో 12 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.



నూతన కార్యవర్గ సభ్యులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మధురవాడ: గాయాలతో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందారు. దీనికి సంబంధించి పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలివి.. వాంబే కాలనీ 6వ బ్లాక్ జీఎఫ్–7లో కల్లూరి శ్రీను(38) పూల అలంకరణ పనులు చేస్తూ కుటుంబంతో జీవిస్తున్నాడు. ఈ నెల 4వ తేదీన బయటికి వెళ్లిన శ్రీను రాత్రి 10.30 సమయంలో వచ్చాడు. మళ్లీ బయటికి వెళ్లిన అతడు మరలా ఇంటికి రాలేదు. తెల్లవారుజామున 4గంటల తర్వాత ఇంటి ముందు తలపై, ఇతర శరీరభాగాలపై గాయాలతో పడి ఉన్న శ్రీనును తల్లి గుర్తించారు. వెంటనే కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శ్రీను మృతి చెందాడు. మేడపై నుంచి పడిపోవడం వలనే శ్రీను మృతి చెంది ఉంటాడని, ఎటువంటి అనుమానాలు లేవని మృతుడి భార్య తిరుపతి ఫిర్యాదులో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మధురవాడ: పీఎం పాలెం పోలీసు స్టేషన్ పరిధి ఎండాడ లా కాలేజీ జాతీయ రహదారి జంక్షన్ వద్ద సోమవారం మధ్యాహ్నం 11గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలివి.. ఆనందపురం మండలం గండిగుండం ఎస్సీ బీసీ కాలనీ చెందిన తాటిపూడి రాము సీలింగ్ పనులు చేస్తుంటాడు. ఇతడు పనులపై మీద ద్విచక్రవాహనంపై వెళ్లి వస్తుండగా సోమవారం ఎండాడ వద్ద రోడ్డు ప్రమాదం జరగడంతో పక్కటెముకలకు గాయాలయ్యాయి. యువకుడిని వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హాస్టల్ భవనం ప్రారంభం కాకుండానే ..

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్ ఆవరణలో కళాశాల బాలికల వసతి కోసం నిర్మించిన భవనం ఆరేళ్లుగా ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం ఈ భవనంలో తాత్కాలికంగా చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నిర్వహిస్తున్నారు. ఈ భవనంలో నిర్మించిన సెప్టిక్ ట్యాంక్ ప్రస్తుతం లీకవుతోంది. దీంతో ఈ నీరు గుడివాడ నుంచి శ్రీరామకృష్ణ స్కూల్‌కు వెళ్లే రహదారిపై చేరుతోంది. ఈ మార్గంలో స్కూల్‌కు వెళ్లే విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నడిచి వెళ్తున్నప్పుడు కాళ్లు బురదగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వసతి భవనం నుంచి లీకేజీలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.



పాఠశాలకు వెళ్లే మార్గంలో లీకైన నీరు

దుకాణాలు, కార్యాలయాలకు వెళ్లేదెలా?

- రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు
- వినియోగదారుల అవస్థలు

తగరపువలస: స్థానిక ప్రధాన రహదారికి ఇరువైపులా చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న దుకాణాల కారణంగా లోపలికి వెళ్లేవారికి ఇబ్బందిగా ఉంటుంది. చిరువ్యాపారుల వెనుక ఉన్న ఇతర దుకాణాలు, బ్యాంకులు, పోస్టాఫీసు వంటి వాటికి వెళ్లే వినియోగదారులు, ఖాతాదారులకు మార్గం లేకుండా పోయింది. నిత్యం రద్దీగా ఉండే తగరపువలస ప్రధానమార్గంలో కొన్నేళ్లుగా పార్కింగ్ సమస్య కూడా వేధిస్తోంది. దీంతో వాహనదారులు తమ వాహనాలను కూడా రోడ్డును ఆనుకుని పార్క్ చేస్తున్నారు. లోపల ఉన్న వ్యాపారులు తెలివిగా ఎక్కడో ఒకచోట గ్రిల్స్‌తో మార్గం ఏర్పాటు చేసుకున్నా, లోపలికి వెళ్లేవారి కాలికి గ్రిల్స్ తగులుకుని పడిపోతున్నారు. ప్రజలకు ఇబ్బంది లేని విధంగా చిరు వ్యాపారుల మధ్య దూరం ఉంచి లోపలికి వెళ్లేలా చూడవలసిన బాధ్యత టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి ఉంది. కేవలం వినియోగదారులకే కాకుండా చిన్నపాటి సందులలో నివాసం ఉంటున్న వారికి కూడా రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసుకున్న చిన్న దుకాణాల వలన తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి గాను మార్క్ చేసి మార్గం వదలాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ప్రధాన రహదారిలో వరుసగా చిరు వ్యాపారులు

విద్యుత్ చార్జీలపై నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

మధురవాడలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవకాశం

మధురవాడ: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు విద్యుత్ చార్జీల (టారీఫ్)పై ఆన్‌లైన్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్టు ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. మధురవాడలోని విశాఖ జోన్–3 కార్యాలయం వద్ద ఈ నెల 7, 8, 10 తేదీలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయాలు సేకరిస్తామని చెప్పారు. ఇందులో ఏపీఈఆర్‌సీ ఇన్‌చార్జి చైర్మన్ ఠాకూర్ రాంసింగ్, ఫైనాన్స్ మెంబర్ పీవీఆర్ రెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు.ఆన్‌లైన్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనదలచే వారు ముందుగా మధురవాడ సబ్‌స్టేషన్ సమీపంలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. పేర్లు నమోదు చేసుకోని వారికి నియంత్రణ మండలి అనుమతితో అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని జోన్–3 పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాసరావు కోరారు.

వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలిగా జ్యోతికమల

పీఎం పాలెం: స్థానిక ఫ్రెండ్స్ వనితా వాకర్స్ క్లబ్ నూతన అధ్యక్షురాలిగా జ్యోతి కమల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా కె.భ్రమరాంబ, సెక్రటరీగా బి.పద్మజ, జాయింట్ సెక్రటరీగా ఎ.సుజాత, ట్రెజరర్‌గా జి.విజయలక్ష్మి, జాలీ వాకర్‌గా రాజ్యలక్ష్మిలను, మరో 9 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పద్మనాభం మండల సర్వసభ్య సమావేశం రేపు

పద్మనాభం: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల ఎనిమిదో తేదీన పద్మనాభం మండల సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ తెలిపారు. ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వితరణ



కేంద్రానికి సామగ్రి అందిస్తున్న కార్పొరేటర్

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు పరదేశిపాలెం అంగన్‌వాడీ కేంద్రానికి వార్డు జనసేన అధ్యక్షుడు దేవర శివ బీరువా, ఫ్యాన్, ఇతర సామగ్రిని సమకూర్చారు. వాటిని కార్పొరేటర్ ఎం.హేమలత చేతులమీదుగా అంగన్‌వాడీ కార్యకర్త బోర సూకరత్నంకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు శ్రీకాంత్, బోర వెంకటేష్, కొండపు రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని బందోబస్తుకు పోలీసుల రాక

తగరపువలస: ఈ నెల 8న ప్రధాని నరేంద్ర మోదీ నగరానికి రానున్న సందర్భంగా గుంటూరు, బాపట్ల, పల్నాడుకు చెందిన 200 మంది పోలీసులు బందోబస్తు కోసం వచ్చారు. వీరికి స్థానిక ప్రైవేట్ కల్యాణమండపాలలో బస ఏర్పాటు చేశారు. చిట్టివలస శ్రీలక్ష్మి శ్రీనివాస కల్యాణమండపం, శ్వేతా కన్వెన్షన్ హాల్, ఈ–1 గ్రాండ్, టి.నగరపాలెం వద్ద జాతీయరహదారిని ఆనుకుని ఉన్న కల్యాణమండపాలు, ఫంక్షన్‌హాళ్లు వీరికి కేటాయించారు.

సీపీఐ నాయకుడు అప్పారావు మృతి



చెల్లూరు అప్పారావు (ఫైల్)

తగరపువలస: చిట్టివలసకు చెందిన సీపీఐ నాయకుడు చెల్లూరు అప్పారావు సోమవారం వృద్ధాప్యం కారణంగా మృతి చెందారు. 1960లో చిట్టివలస జ్యూట్‌మిల్లులో ఉద్యోగం కోసం వచ్చిన ఆయన ఇక్కడ స్థిరపడ్డారు. అప్పారావుకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సామ్యవాదంపై ఆసక్తితో సీపీఐలో చేరారు. భీమిలి ఏరియా సీపీఐ నాయకులు ఆయన భౌతిక కాయంపై ఎర్రజెండా ఉంచి, రెడ్ సెల్యూట్ చేశారు. అనంతరం ఆయనకు అంతిమ వీడ్కోలు పలికారు. ఆయనకు నివాళులు అర్పించిన వారిలో కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, కొండపు ఈశ్వరరావు, చిల్ల అప్పలసూరి, రాంపైడి, ఆదినారాయణ, వీర్రాజు పాల్గొన్నారు.